క్లుప్తంగా

క్రీడలతో చురుకుదనం



విద్యార్థులకు క్రీడా వస్తువులు అందిస్తున్న రాజేష్ తాటే

పరవాడ:క్రీడల వల్ల చురుకుదనంతో పాటు మానసిక పరివర్తన కలుగుతుందని లుపిన్ ఫార్మా కంపెనీ హెడ్ రాజేష్ తాటే అన్నారు. లుపిన్ ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని పలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాలీబాల్స్, త్రోబాళ్లు, నెట్‌లు, స్కిప్పింగ్ రోప్స్,క్యారమ్, చెస్ బోర్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు, హోమ్ వర్క్‌లతో బిజీగా ఉన్నా ఆటలకు సమయం కేటాయించాలన్నారు. లుపిన్ ఫార్మా డీజీఎం (హెచ్‌ఆర్) శ్రీనివాసరావు ,పాఠశాల హెచ్ఎం పి.కనకేశ్వరరావు, లుపిన్ ఫార్మా అడ్మిన్ జె.అనిల్‌కుమార్, మేనేజర్ డి.వెంకట్, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల ముత్యాలు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతనికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్మును గ్రామ వలంటీరు సీహెచ్ కొర్లయ్య , గృహ సారథి సీహెచ్ అప్పారావు తమ సొంత ఖర్చులతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు సమక్షంలో పింఛన్ సొమ్ము అందజేశారు.

ఘనంగా మానసిక ఆస్పత్రి వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద ఆస్పత్రిగా మానసిక వ్యాధి నివారణకు అందిస్తున్న సేవలను శ్లాఘించారు. అందరి సహకారంతో ఈ ఆస్పత్రి మరింత విస్తృత స్థాయిలో సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రోగికి సాంత్వన చేకూర్చేలా సేవలు సాగాలన్నారు. అలాగే వైద్యుల దినోత్సవాన్ని కూడా నిర్వహించారు.

జీఎస్టీ ఒక సామాజిక సంస్కరణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీని ఆర్థిక సంస్కరణ కంటే ఒక సామాజిక సంస్కరణగా భావించాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో వస్తు సేవల పన్ను దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో అతిపెద్ద సంస్కరణ అని తెలిపారు. విద్యార్థులు ఈ పన్ను సంస్కరణలను బాగా ఆకలింపు చేసుకుని ఆచరణ ద్వారా భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. విస్తృత సంస్కరణలు,సమాలోచనల అనంతరం కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాల భాగస్వామ్యంతో ఒకే దేశం ,ఒకే పన్ను,ఒకే విపణిగా 2017లో ఈ జీఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యాపకులు గోవిందరావు,డాక్టర్ పి. స్వామినాయుడు,ఎం. రామకృష్ణ, గోపాలకృష్ణ, వి. హేమకుమారి,రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ సమీపాన జూన్ 17న గుర్తు తెలియని ఒక వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదే రోజున 108 సహాయంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి చికిత్స పొందుతూ జూన్ 30వ తేదీ అర్ధరాత్రి చనిపోయాడు. ఇతని వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. వడదెబ్బ లేదా ఇతర అనారోగ్య కారణాల వల్ల మరణించి ఉండవచ్చని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వయసు సుమారు 75 ఏళ్లు ఉండవచ్చని, వివరాలు తెలిసిన 94406 27547/98664 13487 నంబర్లలో తెలియజేయాలని త కోరారు.

సురక్ష..పేదలకు రక్ష

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పరవాడ, పెందుర్తి,సబ్బవరం మండలాల్లో జగనన్న సురక్ష ప్రారంభం

సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుభవార్త చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఇంటింటికీ పంపించి వివరాలు సేకరించారు. పథకాలు పొందడానికి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా జారీకి అవకాశం కల్పించారు. పెందుర్తి నియోజకవర్గంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. వారి మోములో ఆనందం కనిపించింది.



అమృతపురం సచివాలయం వద్ద లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పరవాడలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల పేద ప్రజలకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శనివారం పరవాడలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు మేలు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడతో పాటు అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేయడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకుంటారని చెప్పారు. కుల, ఆదాయ, జనన, మరణ, ఎఫ్ఎంసీ ధ్రువీకరణ పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డ్ విభజన తదితర 11 సేవలను ఉచితంగా పొందే అవకాశం ఉందన్నారు. కుల మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పరవాడ 1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో 578 మంది వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకోగా వాటిలో 553 సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మండల ప్రత్యేక అధికారి ఎస్.ఈ.పి. ఆర్. వీరన్నాయుడు, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, జగనన్న సురక్ష నియోజకవర్గ కన్వీనర్ కొటాన రాము, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు కాసు అంజిరెడ్డి, ఉప సర్పంచ్ బండారు రామారావు, పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో అందరికీ మేలు

సింహాచలం: ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అర్హులైన వారికి పథకాలు అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. ఎస్ఆర్‌పురంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ అర్హులైన వారు పథకాల లబ్ధికి దూరం కాకూడదనే సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఎంపీడీవో వసంత మాట్లాడుతూ ఎస్ఆర్‌పురంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 636 దరఖాస్తులు స్వీకరించారని చెప్పారు.అందరికీ ఆయా సర్టిఫికెట్లు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పలువురికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో వెంకటరావు, ఆర్ఐ సాయి, వీఆర్వో రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుపాడ అంజి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వాలిమెరకలో ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ దేవి తదితరులు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

వాలిమెరకలో..

పెందుర్తి మండలం వాలిమెరకలో తహసీల్దార్ శ్యామ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేశారు. దీర్ఘకాలిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీటీసీ స్వప్న, గ్రామ సర్పంచ్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ అర్జీకి పరిష్కారం

సబ్బవరం: సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న ప్రతి అర్జీని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని అమృతపురం సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రజల ముంగిటకే వచ్చి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్నారు.అమృతపురం సచివాలయం పరిధిలో 309 మంది నుంచి అర్జీలు రాగా ఇప్పటికే 298 మంది సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన మరో 11 అర్జీలను సకాలంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు.

- అలాగే ఎంపీడీవో రమేష్ నాయుడు ఆధ్వర్యంలో తవ్వవానిపాలెం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, నియోజకవర్గ జగనన్న సురక్ష కార్యక్రమం ఇన్‌చార్జి రాము,సర్పంచ్ బైలపూడి గౌరి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, నాయకులు బోకం రామునాయుడు,బైలపూడి రామారావు,డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,ఈవోఆర్‌డీ మహేష్, ఏవో పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోనే పత్రం



గతంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివచ్చేది. నేడు జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేస్తే విచారణ జరిపి వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎలాంటి రుసుం తీసుకోకుండా ధ్రువ పత్రాలు అందజేస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇదంతా జగనన్న పుణ్యమే.

–పైల దేముడమ్మ, పరవాడ

జగనన్నకు రుణపడి ఉంటా..



కౌలు రైతు సర్టిఫికెట్ లేక ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను కోల్పోతున్నారు. ఎట్టకేలకు జగనన్న పుణ్యమా అంటూ నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారం రోజుల కిందట కౌలు రైతు సర్టిఫికెట్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాను. వివరాలను పరిశీలించి వెనువెంటనే కౌలు రైతు సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఇప్పుడు విత్తనాలు, ఎరువులు, పంట నష్టాలు, ఇన్సూరెన్స్ వంటి రాయితీలు పొందే అవకాశం కలిగింది. చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటా.

– సిరపరపు సన్యాసినాయుడు, పరవాడ

ఘనంగా వైద్యుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్‌లోని జీవన్‌రేఖ ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని సంస్థ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సింహాద్రి సీఎంవో ఎ.కె.దాస్ వైద్య విజ్ఞాన ప్రపంచంలో టెలిమెడిసిన్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ నిస్వార్థ సేవలందిస్తున్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సేవలందించడంలో వైద్యులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. టెలీమెడిసిన్ రాకతో సాంకేతికను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఎం ఎస్.గోవిందరాజన్, ఓ అండ్ ఎం జీఎం డి.పి. పాత్ర, జీఎం ఆర్‌ఆర్ పరిధా, హెచ్‌ఆర్ హెడ్ రుమాడీశర్మ, సీఐఎస్ఎఫ్ డీసీ వి.కె.ప్రభాకర్, వైద్య సిబ్బంది, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై విచారణ జరపాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

పరవాడ: అచ్యుతాపురంలోని సాహితి ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సాహితి పరిశ్రమలో జరిగిన ప్రమాదం భద్రత డొల్లతనాన్ని బయటపెడుతుందన్నారు. సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల రక్షణను యాజమాన్యాలు పూర్తిగా గాలికి వదిలేస్తున్నాయన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం చెల్లించి గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, జి.సింహాచలం, ప్రసాద్, లోవరాజు, శ్రీను పాల్గొన్నారు.

వీరుల త్యాగం వృథా కానివ్వం



దీక్షలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగ ఫలితాన్ని వృథా కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న దీక్షల్లో 870వ రోజు శనివారం సంస్థలోని ఈఎస్ అండ్ ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టిక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో తదితర విభాగాల కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఉక్కు పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో సంస్థల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా అనుసంధాన్ సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జాబ్‌మేళా సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 29 సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ సంస్థల్లో 430, ఇతర సంస్థల్లో రెండు వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించినట్లు అనుసంధాన్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ఆడ్ల సుభాష్ తెలిపారు. విద్యార్థులకు ముందుగా ఒక నిర్దిష్టమైన బయోడేటా ఫారం అందించి, నిర్వాహకులు వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థుల విద్యార్హతలకు అనుగుణంగా నియామక ప్రక్రియ జరిపారు. పూర్తి స్థాయిలో ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి ప్రత్యేకంగా టెంట్లు, తాగునీరు, కుర్చీలు వంటివి ఏర్పాటు చేశారు. ఏయూ భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రవిభాగంలోని సమావేశ మందిరాల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించారు.

యువతకు ఆధ్యాత్మిక విలువలు ఉండాలి



నాగఫణిశర్మకు జ్ఞాపిక బహూకరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: ఆధ్యాత్మిక విలువలు, నైతికత యువత అలవరచుకోవాలని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. శనివారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోపం ఫలితాలు, నిర్వహణ విధానాలను వివరించారు. భారతీయ తాత్విక భావనలు ప్రజల మానసిక సమస్యలకు పరిష్కారాలు అందిస్తాయన్నారు. అనంతరం సింహ వారాహముఖి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తక రచయితలు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, డాక్టర్ డి.కె.ఐ.ఎస్.ప్రసాద్‌ను అభినందించారు. సదస్సులో కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ, సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.విజయ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

బీసీ సదస్సు నేడు

మద్దిపాలెం: ఈ నెల 2న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహిస్తాయని తెలిపారు. దేశ జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఉద్యోగాలు, అధికారం, సంపదలో ఆ స్థాయి భాగస్వామ్యం లభించడం లేదన్నారు. వారి అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో సమగ్రమైన చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి ఏఐబీసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ హక్కుల ఉద్యమ నేత, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, అనేక మంది జాతీయ నాయకులు, రాష్ట్రంలోని 132 వెనుకబడిన కులాల నాయకులు హాజరవుతారన్నారు. ఏఐబీసీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నాడు శుష్క వాగ్దానాలు.. నేడు హామీల అమలు

- పాలనలో తేడా పరిశీలించండి
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల్లో ఒకటో, రెండో తప్ప అమలు చేసిన పథకాలే కనిపించవు.. అదే ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలో అమలు చేసి చూపించారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పాలనలో మార్పు గమనించాలని ప్రజలను కోరారు. 85వ వార్డు మంత్రిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధి చేకూరిన పథకాలు వివరించారు. అపరిష్కృత సమస్యల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా చాలా వరకు సమస్యలు పరిష్కరించామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంపూర్ణంగా పరిష్కరించి, సమస్యలు లేని కుటుంబాలు, సమస్యలు లేని గ్రామాలను చూడాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను శ్రేయో రాజ్యంగా, ప్రగతి పథంలో పయనించే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కింతాద ఈశ్వరరావు, నాయకులు పచ్చికోరు రమణమూర్తి, సేనాపతి గంగరాజు, గొన్న హేమచంద్ర, ప్రసాద్, కిషోర్, కాతా నూకేష్, అప్పలరాజు, కనకరాజు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితాలు

- ఈఆర్‌వో లక్ష్మారెడ్డి
- బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు



మాట్లాడుతున్న ఈఆర్‌వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించడంలో బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)లు పారదర్శకంగా పని చేయాలని గాజువాక ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఆదేశించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనర్హుల ఓటర్లను ధ్రువీకరించడంతో పాటు పది మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న డోర్ నంబర్లను గుర్తించాలన్నారు. వందేళ్ల వయసు పైబడినవారిని, వారి గృహాలను కూడా ధ్రువీకరించాలన్నారు. ఇప్పటికే తొలగించిన ఓటర్లకు నోటీసులను జారీ చేయాలని, మృతి చెందినవారు, డూప్లికేట్ ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లను నమోదు చేయాలని, ఇంకా మిగిలి ఉన్న ఎపిక్ కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈపీ నిష్పత్తి, లింగ నిష్పత్తి, పర్యవేక్షణ, దావాలు, అభ్యంతరాల ధ్రువీకరణ ప్రక్రియ, బీఎల్‌వోల రిజిస్టర్ల తయారీ, పోలింగ్ ప్రాంతం, విభాగాల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల నమోదు సహాయ అధికారులు పి.సింహాచలం, పాల్ కిరణ్, పి.రమాదేవి, మహాపాత్రో, కె.త్రినాథరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని ప్రభావితం చేసేవి కథలు

సీతంపేట: సమాజ స్థితిని, గతిని మార్చే శక్తి కథలకు ఉంటుందని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. విశాఖ సాహితి ఆధ్వర్యంలో లలితానగర్ లలితా పీఠంలో శనివారం జరిగిన కథా కచేరిలోఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరి జీవితాన్ని ఏదో ఒక సందర్భంలో కథలు ప్రభావితం చేస్తాయన్నారు. అటువంటి కథల కోసం విశాఖ సాహితి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 15 మంది రచయితలు వారి స్వీయ కథలను చదివి వినిపించి అలరించారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని ,కందాళ కనకమహాలక్ష్మి, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

ఎన్ఐపీఎంకు స్టీల్‌ప్లాంట్ పూర్తి సహకారం



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను సత్కరిస్తున్న ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం)కు స్టీల్‌ప్లాంట్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే తెలిపారు. శనివారం ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యవర్గ సభ్యులు ఉక్కు పరిపాలన భవనంలో నూతన డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు స్వీకరించిన పాండేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపడుతున్న అంశాల గురించి వివరించారు. దీనిపై డైరెక్టర్ పాండే మాట్లాడుతూ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఐపీఎం చాలా కీలకంగా ఉందని, చాప్టర్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో చాప్టర్ కార్యదర్శి శేషగిరిరావు, చైర్మన్ డాక్టర్ మురళీధర్, డాక్టర్ సుధాకర్, అప్పారావు, జోగారావు, డాక్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.